## క్లుప్తంగా

### గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

**ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి**

**సత్తెనపల్లి:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి సూచించారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామీణ అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహిస్తున్న 3వ బ్యాచ్ శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. పంచాయతీల్లో అభివృద్ధి సుస్థిర లక్ష్యాలపై వివరించారు. మండల విస్తరణ అధికారి కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి ముందుగా గ్రామస్థాయిలో జరిగినప్పుడే ఆ ఫలాలు త్వరగా ప్రజలకు చేరువ అవుతాయన్నారు. అందుకు తగ్గట్లుగా స్థానిక ప్రభుత్వ అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. శిక్షణలో ఎంపీహెచ్ఓ శ్రీనివాస్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, ఏపీఎం సమాధానం, పీఎస్ ప్రదీప్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో వీఆర్వోలు, మహిళా పోలీసులు, పశుసంవర్ధక సహాయకులు, గ్రామ సర్వేయర్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

### రైతుల పాలిట వరం ప్రకృతి సాగు



**నార్నెపాడు(ముప్పాళ్ళ):** ప్రకృతి వ్యవసాయ పంటలు రైతుల పాలిట వరాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళి అన్నారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారితో కలిసి బుధవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం మెంటరు రజిని సాగుచేసిన వరి పంటను పరిశీలించారు. వరి పంటలో 33 పిలకలు ఉన్నాయని తెలిపారు. అనంతరం నిరంతరం ఆదాయాన్ని ఇచ్చే ఏటీఎం మోడల్ సాగును పరిశీలించారు. మరో రైతు కొర్రపాటి సౌజన్య ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన మిరప పంటను పరిశీలించారు. సాగులో అంతర పంటలుగా ముల్లంగి, ఉల్లి, కొత్తిమీర, బంతి మొదలగు అంతర పంటలు వేసుకోవడం వలన ఆదాయంతో పాటుగా నాణ్యమైన పంట పండించుకోవచ్చన్నారు. మరో రైతు ఏటీఎం తరహాలో సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయలు సాగును పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంలో వరి సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో మంచి నాణ్యమైన ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, ఎన్ఎఫ్ఏ నందకుమార్, మాస్టర్ ట్రైనర్ మధుబాబు, వీఏఏ ప్రియాంక, ఇన్‌చార్జ్ ఫౌజ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**రైతులు పంట బీమా చేయించుకోవాలి**

**బొల్లవరం(ముప్పాళ్ళ):** జిల్లాలో వరి సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఇన్స్యూరెన్స్ చేయించుకోవాలని, వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. ముప్పాళ్ళ మండలంలోని బొల్లవరం గ్రామంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎకరాకు వరి పంటకు రూ.630లు బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. ముందుగా రైతుభరోసా కేంద్రంలో ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో తుఫాను హెచ్చరికలతో వరి రైతాంగం అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

### రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**సత్తెనపల్లి:** మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 20న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎక్స్ అఫీషియోగా స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు.

### బాధిత మహిళకు నిత్యావసరాలు పంపిణీ



**వినుకొండ(నూజెండ్ల):** పట్టణంలోని సంజీవ గాంధీనగర్ 30వ వార్డులో నివసిస్తున్న ఎస్‌కె మంగమ్మ ఒంటరి మహిళ కిడ్నీల సమస్యలతో బాధపడుతోంది. ఈసందర్భంగా గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గంగినేని రాఘవరావు చేతుల మీదుగా బాధిత మహిళకు 45 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు బుధవారం అందజేశారు. ఈకార్యక్రమంలో లగడపాటి శ్రీనివాసరావు, భక్తుల గోవిందరాజులు, బోడపాటి రామారావు, సోమేపల్లి శ్రీనివాసరావు, గోవిందయ్య, అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

# ఎరువు.. గుండె బరువు!

- బస్తాపై రూ.100–150 వరకు పెంపు
- ఎకరాకు రూ.2వేలకుపైనే అ'ధన'పు భారం
- పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్న రైతులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్బీకేల్లో తక్కువ ధరలకే ఎరువులు
- పెదకూరపాడు నియోజవర్గంలో 10 వేల ఎకరాలకు పైగా రబీ సాగు



సరుకుళ్లపాడులో సాగవుతున్న పుల్లశనగ పైరు

**ధరల పెరుగుదల ఇలా..**

| ఎరువు | గత ప్రభుత్వ హయాంలో ధర(రూ.) | ప్రస్తుత ధర(రూ.) |
|---|---|---|
| 15–15–15 కాంప్లెక్స్ ఎరువు (50కిలోల బస్తా) | 1150 | 1450 |
| 20–20–13 | 1200 | 1300 |
| 28– 28–28 | 1600 | 1700 |
| 24–24–0 | 1700 | 1800 |
| 10–26–26 | 1300 | 1470 |
| డీఏపీ | 1200 | 1350 |




**అమరావతి:** వరదలు, భారీవర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న ప్రస్తుత పరిస్థితుల్లో సాగు భారంగా మారింది. అన్నదాతల పరిస్థితి దయనీయంగా తయారైంది. సేద్యపు ఖర్చులే భారంగా మారిన నేపథ్యంలో ఎరువుల ధరలు పెరగటంతో అన్నదాతకు అప్పులు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ప్రతి ఏడాది ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం అందటంలేదు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న ఏడాదికి రూ.20వేల ఊసేలేదు. దీంతో రైతుల్లో పూర్తిగా నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి. ఖరీఫ్ సీజన్లో వరదలు, భారీ వర్షాల కారణంగా దిగుబడులు తగ్గాయి. అరకొర దిగుబడులతో దిగులు చెందుతున్న రైతులకు పెరిగిన ఎరువుల ధరలు మరో భారం కానుంది.

**'ధరా'భారం..**

పెదకూరపాడు నియోజవర్గంలోని ఐదు మండలాలలో 10 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. కంది, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న, పుల్లశనగ తదితర పంటలతో పాటుగా సుమారు 2వేల ఎకరాలలో మిరపసాగు చేస్తున్నారు. రబీవరి కూడా తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. రైతులు ఎక్కువగా వినియోగించే కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగి భారంగా మారాయి. ఒక్కో రకం బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు పెరిగాయి. ఈరకంగా ఒక్కో రైతుకు ఎకరాకు రూ.2వేలకు పైగానే అదనపు భారం పడనుంది. ఏ పంటకైనా మోతాదు తగ్గకుండా ఎరువులు వేస్తేనే ఆశించిన దిగుబడులు వస్తాయి. ధరలు పెరగడంతో రైతులు అధికంగా తక్కువ ధరకు వచ్చే యూరియా ఎక్కువగా వాడుతూ డీఏపీ, ఎంఓపీ వంటి కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలోని మిరప పంటకు సుమారు మూడు నుంచి నాలుగు సార్లు ఎరువులు వాడతారు. అందులో 12 బస్తాల కాంపెక్స్ ఎరువులు, నాలుగు బస్తాల యూరియా ఉంటుంది. అలాగే మినుము, కంది, మొక్కజొన్న పంటలకు కూడా కాంప్లెక్స్ ఎరువులను అధికంగా వాడే రైతులు నేడు డబ్బులేక యూరియా ధర తక్కువగా ఉండడంతో అధికంగా వాడుతున్నట్లు సమాచారం.

**రైతులకు దన్నుగా గత ప్రభుత్వం**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఆర్బీకేల ద్వారా బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకు ఎరువులు అందేవి. రైతుకు కావాల్సిన ఎరువులను ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లోని కియోస్క్ మిషన్లో నమోదు చేసిన ఒకటి రెండు రోజుల్లోనే ఎరువులు అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతు భరోసా కేంద్రాలను నిర్లక్ష్యం చేయటమే కాకుండా కియోస్క్ మిషన్లు వాడిన దాఖలాలు లేవు. రైతుభరోసా కేంద్రాల పేరు మార్చటమే గానీ సేవలు మాత్రం అందటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరకొరగా రైతుసేవా కేంద్రాలు, సొసైటీలలో ఎరువులను అందుబాటులో ఉంచి కాలయాపన చేస్తున్నారు తప్పితే ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి నెల కొందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**సబ్సిడీపై సరఫరా చేయాలి**



రైతులు వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల నష్టపోతున్నారు. కంపెనీలు ఎరువుల ధరలను ఎడాపెడా పెంచితే మాపై మోయలేని భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను నియంత్రించాలి. ఖరీఫ్‌లో నష్టపోయి రబీ సీజన్లో పంటల సాగుకు పెట్టుబడి పెట్టే పరిస్థితి లేదు. రాష్ట్రప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను సబ్సిడీపై సరఫరా చేయాలి.

– యన్నం సైదారెడ్డి, రైతు, మునగోడు

**అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు**

ప్రభుత్వం సూచించిన ధర కంటే అధికంగా ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం ఎరువులు కావాల్సిన రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలి. వ్యవసాయాధికారులు సూచించిన ప్రకారం రైతులు ఎరువులను వినియోగించుకోవాలి.

– షేక్ అహ్మద్, మండల వ్యవసాయశాఖాధికారి, అమరావతి

### బ్రాహ్మణపల్లిలో 'స్వామియే శరణం అయ్యప్ప..'



**రాజుపాలెం:** మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగింది. 41 రోజులు మాలధరించి కఠోర దీక్షచేసిన స్వాములు బుధవారం శబరిమల బయలు దేరుతున్న తరుణంలో గ్రామంలో కోలాహలం నెలకొంది. మేళతాళాలతో స్వాములు గ్రామంలో స్వామియే శరణమయ్యప్ప అంటూ గ్రామోత్సవం నిర్వహిస్తుండగా భక్తులు స్వామివార్లకు వారులు పోసి మొక్కుకున్నారు. స్వాములను పూలతో ముంచెత్తారు. అనంతరం మరకతలింగం కలిగిన శివాలయానికి చేరుకున్నారు. గురుస్వామి బత్తుల శివయ్య ముడుపులు కట్టారు. శివాలయం పూజారి కోనూరు నరసింహ శ్రీనివాసశర్మ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. 1500 మందికి అన్నదానం నిర్వహించారు.

### వర్సిటీ అథ్లెటిక్స్ మీట్‌లో వాగ్దేవి విద్యార్థులకు పతకాలు

**నరసరావుపేట ఈస్ట్:** ఏఎన్‌యూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో వాగ్దేవి కళాశాల విద్యార్థులు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాదు బుధవారం తెలిపారు. వర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థులు డి.వీరాంజనేయులు డిస్క్‌త్రోలో బంగారు, షార్ట్‌పట్‌లో వెండి పతకాలు, 4''400 మీటర్లు రిలే పరుగు పందెంలో బంగారు పతకం, కె.ప్రవీణ్‌కుమార్ 200 మీటర్లు, 400 మీటర్లులో వెండి పతకాలు, షేక్. అల్మాస్ 400 మీటర్లు హర్డిల్స్‌లో కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంతరెడ్డి**



మాట్లాడుతున్న సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంతరెడ్డి

**సత్తెనపల్లి:** భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని సత్తెనపల్లి ఆర్డీఓ జీవీ రమణాకాంతరెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లిలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా అర్జీలు అందించి వాటిని పరిష్కరించుకోవాలన్నారు. అలాగే రీ సర్వే ప్రక్రియ ప్రారంభం కానున్న దృష్ట్యా గ్రామానికి చెందిన ప్రతి ఒక్కరూ రీ సర్వేకు హాజరై తమ భూ హక్కులను నిర్ధారించుకోవాలన్నారు. సర్వే ఏడీ భాను కీర్తి మాట్లాడుతూ 4వ విడత రీ సర్వే కింద కంకణాలపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందించాలన్నారు. ఈ సందర్భంగా రైస్ కార్డులకు –45, సర్వే నిమిత్తం –2 , మ్యూటేషన్‌కు– 7, అడంగల్ సవరణకు–2, మొత్తం 56 దరఖాస్తులను అందించారు. సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ బోసు బాబు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**దొడ్లేరులో..**

**దొడ్లేరు(క్రోసూరు):** మండలంలోని దొడ్లేరు గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎనిమిది అర్జీలు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

**కుంకలగుంటలో...**

**నకరికల్లు:** భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ కె.పుల్లారావు తెలిపారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలతో రైతులు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సదస్సులో 12 అర్జీలు వచ్చాయని, భూసమస్యల అర్జీలు సకాలంలో పరిష్కరిస్తామని అన్నారు. డీటీ కె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఆర్ఐ పురుషోత్తం, వీఆర్వోలు గోపువిష్ణు, కృష్ణకుమారి, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**నేడు తాళ్లచెరువులో రెవెన్యూ సదస్సు..**

**అచ్చంపేట:** మండలంలోని తాళ్లచెరువులోని గ్రామ సచివాలయంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సమస్యలపై సదస్సు జరుగుతుందని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లచెరువు సచివాలయ పరిధిలో గ్రామాల వారు రెవెన్యూ సమస్యలపై పరిష్కారం కోసం అర్జీలు ఇవ్వవలసినదిగా కోరారు.

## స్మార్ట్‌మీటర్లతో బతుకులు అంధకారమయం



స్మార్ట్‌మీటర్‌ను పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నేతలు

**అమరావతి:** విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయటం వల్ల రాబోయే రోజులలో గ్రామీణ ప్రాంతాలలో నిరక్ష్యరాస్యులైన పేదలకు ఇబ్బందులు తప్పవని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. బుధవారం విద్యుత్‌శాఖ వ్యాపార సంస్థలకు అమర్చిన స్మార్ట్‌మీటర్లను ప్రజాసంఘాల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల వలన రాబోయే రోజుల్లో పేదలు అంధకారంలో మగ్గాల్సిన ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పైన విద్యుత్ చార్జీలు పెంచి భారాలు వేయటం దారుణమన్నారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అదాని వంటి కార్పొరేట్ దిగ్గజాలకు కొమ్ము కాస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్లు మొదటగా ప్రభుత్వం ఆఫీసులు వ్యాపారస్తులకి అమరుస్తున్నారని రెండో విడత ఇళ్లకు కూడా అమర్చటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్ రీచార్జ్‌లాగానే స్మార్ట్‌మీటర్లను రీచార్జ్ చేయించుకుంటేనే కరెంటు సరఫరా అవుతుందన్నారు. ప్రస్తుత విధానంలో వాడకున్న విద్యుత్‌కు 30రోజుల తర్వాత బిల్లు చెల్లించే వెసులుబాటు ఉందని ఈ వెసులు బాటు పేదలకు ఎంతగానో కలిసి వస్తుందన్నారు. స్మార్ట్‌మీటర్లు రీచార్జ్‌చేయటం ఆలస్యమైతే పేద కుటుంబాలు అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఈ పరిశీలనలో ప్రజా సంఘాల నాయకులు సయ్యద్‌మొహిద్దీన్‌వలి, నాయుడు సాంబశివరావు పాల్గొన్నారు.

## రైతు సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, తదితరులు

**సత్తెనపల్లి:** రైతుల పరంగా వచ్చే రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లిలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సతహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పెండ్యాల మహేష్ మాట్లాడుతూ రైతులను చిన్న పనులకు కూడా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని, రేషన్ కార్డులలో పేర్ల నమోదులో కూడా అలసత్వం వహిస్తున్నారన్నారు. సాగుదారుడు కాకుండా మరొకరి పేరుతో భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ఏమిటని అధికారులను నిలదీశారు. నేషనల్ హైవే 167 ఏజీ కింద భూములు కోల్పోతున్న రైతులకు తగిన నష్ట పరిహారం ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వావిలాల నగర్ కాలనీలో నివసిస్తున్న 400 కుటుంబాలకు ఇంటి స్థలాలకు యాజమాన్య హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు పచ్చ సుధీర్, సోలనంబి, పచ్చ అప్పారావు, మల్లీశ్వరి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### సెన్సార్ బోర్డు సభ్యుడిగా సిరిపురపు అప్పారావు

**నాదెండ్ల:** నాదెండ్ల మండలం చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ సిరిపురపు అప్పారావు కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు మెంబర్‌గా రెండో సారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన్ను పలువురు అభినందించారు. ఈయన గతం మూడేళ్ళుగా సెన్సార్ బోర్డు సభ్యుడిగా పనిచేయగా, మరో మూడేళ్ళపాటూ పదవీ కాలాన్ని బోర్డు పెంచింది. రామకృష్ణ మఠం, వివేకానంద కేంద్రం వంటి వివిధ ధార్మిక సంస్థల్లో 18 ఏళ్ళ పాటూ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతం బీజేపీ క్రియాశీలక సభ్యుడిగా కొనసాగుతున్నారు. సినిమాలు సమాజానికి మేలు చేసే విధంగా ఉండాలని, ప్రజలను చైతన్యవంతుల్ని చేసే సినిమాలకు ప్రజాదరణ ఉంటుందన్నారు. ప్రస్తుతం దర్శక నిర్మాతలు పూర్తి కమర్షియల్ చిత్రాలకే కాకుండా ప్రజలకు ఆదర్శంగా ఉండే చిత్రాలు తీయాలని అప్పారావు ఆకాంక్షించారు. గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి ఆయన్ను అభినందించారు.

### సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

**రాజుపాలెం:** సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి గ్రామ స్థాయిలో అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి జీవీ సత్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండవ బ్యాచ్‌కు చెందిన సర్పంచ్‌లకు, మండల స్థాయి అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై బుధవారం శిక్షణ జరిగింది. ఈ శిక్షణలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఏపీఎం శివకుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కేఎండీ ముక్తియార్, సిబ్బంది పాల్గొన్నారు.

### వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



**క్రోసూరు:** మండల కేంద్రమైన క్రోసూరులోని బుడగజంగాలకాలనీలోని వృద్ధులకు, వితంతువులకు బుధవారం సంఘ సేవకుడు శిఖ్యాంసన్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిఖ్యాంసన్ మాట్లాడుతూ క్రీస్తు చూపిన మార్గంలోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచ మానవాళికి క్రీస్తు బోధనలు అనుసరణీయమని, ప్రేమ, కరుణ, దయ,పొరుగు వారిని ప్రేమించటమే క్రీస్తు మార్గమని పేర్కొన్నారు. అనంతరం పండ్లు, కేకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రిక, సలోమాను తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

**సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు**



**సత్తెనపల్లి:** చదువుతోపాటు ప్రతి విద్యార్థి క్రీడల్లోనూ రాణించాలని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం ఆక్స్‌ఫర్డ్ పాఠశాల స్పోర్ట్స్ మీట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులంతా క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని, గెలుపోటములనేవి శాశ్వతం కాదన్నారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. తొలుత క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకొని అభినందించారు. సత్తెనపల్లి రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల డైరెక్టర్ జోసెఫ్, ప్రిన్సిపల్ లావణ్య లహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీవారికి ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు



అచ్చంపేట హరిహర క్షేత్రం లోని వేంకటేశ్వరస్వామి

**సత్తెనపల్లి:** ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో, రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వ హించారు. ధనుర్మాసం సందర్భంగా రైల్వేస్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 20న శ్రీవారికి మత్స్య అవతారం, 21న స్థిర వారం (శనివారం) శ్రీవారికి శ్రీ కూర్మావతార అలంకారం జరుగుతుందని శ్రీవారి సేవకులు తెలిపారు. మానవులు కష్టాల సముద్రంలో ఈదలేకపోతుంటే మన కష్టాలను శ్రీవారు కూర్మావతార రూపంలో సముద్రం నుంచి పైకి నెట్టేస్తారని భక్తుల నమ్మకమన్నారు. అదేవిధంగా 22న శ్రీవారికి శ్రీ వెంకట నరసింహావతారం అలంకారం జరుగుతుందని ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారు వెంకట నరసింహస్వామి వారిని స్మరించి ప్రార్థిస్తే ఆర్థిక ఇబ్బందులు తొలగి పోతాయని ఒక నమ్మకం, విశ్వాసం ఉంటుందని తెలిపారు.

**అచ్చంపేట:** విష్ణు మూర్తికి అత్యంత ప్రీతికరమైన మాసం ధనుర్మాసం. ఈ సందర్భంగా మండలంలో పలు వైష్ణ వాలయాలలో స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బుధవారం చల్లగరిగలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. స్థానిక సీతారామస్వామివారి దేవాలయంలో సీతాసమేత శ్రీరామచంద్రులవారిని విశేషంగా అలంకరించారు. హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో స్వామివారిని బంతి, మందార, గులాబీ, విరజాజులు, తులసీ దళాలతో అలంకరించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

## రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'



అమరావతిలో కంది పంటను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సైంటిస్టు రవీంద్రారెడ్డి, ఏఓ అహ్మద్, రైతులు

**అమరావతి:** అమరావతి, ధరణికోట గ్రామాలలో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది క్షేత్ర సందర్శన అనంతరం ఏఆర్ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్టు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ అపరాల సాగులో జీవన ఎరువులైన రైజోబియం, అజోస్పైరిల్లం, అజటోబాక్టర్ వాడాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు. జీవన ఎరువుల వాడకం వల్ల మట్టిలో రసాయన సమతుల్యత ఉండటమే కాకుండా ఖర్చుకూడా తగ్గుతుందన్నారు. మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ మాట్లాడుతూ కంది, మినుము, మొక్కజొన్న పంటనమోదు చేసుకుని తప్పనిసరిగి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలకు, సబ్సిడీలకు అర్హులు కావాలంటే పంట నమోదు తప్పనిసరి అన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది అమరావతి, ధరణికోట గ్రామాల రైతులు, పాల్గొన్నారు.

**క్రోసూరు:** మండలంలోని గుడిపాడు, గాదెవారిపాలెం గ్రామాల్లో ఏఓ వేణుగోపాల్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సీసీఐ ద్వారా ప్రత్తి క్వింటాకు కనీస మద్దతు ధర రూ.7521 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. దీనికి రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకో వలసి ఉంటుందన్నారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది షేక్ మీర్, ఖాజామొహిద్దిన్ మరియు రైతులు పాల్గొన్నారు.

**నకరికల్లు:** రబీసాగులో ఉన్న మొక్కజొన్నలో కత్తెరపురుగు ఉందని నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని కుంకలగుంట, జిల్లాపేటతండా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్.నవాజ్‌షరీఫ్, వీహెచ్ఏ పి.వెంకటసాయి, రైతులు పాల్గొన్నారు.

### విద్యలో రాణిస్తే ఉన్నత శిఖరాలకు..

**యడ్లపాడు:** విద్యార్థులు విద్యలో రాణించినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారని అర్వపల్లి సాంబశివరావు తెలిపారు. మండలంలోని సొలస జిల్లా ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన అర్వపల్లి సాంబశివరావు తండ్రి బ్రహ్మానందం జ్ఞాపకార్థం విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు స్వీట్లు తదితర వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఈవీవీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పశుసంవర్ధక పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గుండ్లపల్లిలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు

**నకరికల్లు:** పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు సూచించారు. 21వ జాతీయ పశుగణన కార్యక్రమంలో భాగంగా మండలంలోని నకరికల్లు, గుండ్లపల్లి, బాలాజీనగర్ తండాలలో చేపడుతున్న పశుగణన కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. పాడిరైతులతో మాట్లాడి పశుసంవర్ధకశాఖ పథకాలను వివరించారు. గుండ్లపల్లి గ్రామంలోని మినీగోకులం షెడ్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఏరియా వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.వెంకటేశ్వర్లునాయక్, సిబ్బంది సూర్యారావు, సలీం, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.